సామెతకథలు

## ఓడ దాటేదాక ఓడ మల్లయ్యగారు - ఓడ దాటాక బోడి మల్లయ్య

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

పూర్వం పల్లెసీమల్లో ఏఱున్న గ్రామాలుంటే ఒక పల్లెనుండి మరొక పల్లెకు పోవడానికి ఎంతో వ్యయప్రయాసగా ఉంటుండేది. అట్టి తరి నదిని దాటించడానికి తెప్పో బల్లకట్టో ఆధారంగా ఉంటుండేవి. వాటిని నడిపే బెస్త కుటుంబమొకటి ఓ ఒడ్డున గుడిసెలో ఉంటుండడం కద్దు.

ఒకనాడొక పట్టణ వాస్తవ్యుడు ఏరు దాటవలసి వచ్చింది. అంతకు పూర్వమే అటకు వచ్చియున్న ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు రేవు దాటించుమని యడిగి విఫలమయ్యారు. ఆ పట్టణ వాస్తవ్యుడు ఆ బెస్తవాని ఊరూ పేరూ, ఆనూపాను తోటి ప్రయాణీకుల వల్లనే తెలుసుకొని "ఓహో! ఓడమల్లయ్యగారూ! మీరానాటినుండి నేటివరకు ఏకదీక్షగా ప్రయాణీకులను తరింపజేయుచున్నారుకదా! అలనాటి గుహుని తరువాత ఇట్టి దీక్షా కంకణం కట్టుకొన్న నిస్వార్ధపరులు ఈ జగాన కన్ను పొడుచుకున్నా కానరారు. రాత్రింబవళ్ళనక మీరు ప్రజాసేవ చేయుచున్నారు. మీ సేవా భావము కడు ప్రశంసనీయము. మానవసేవే మాధవసేవ కదా! మీ మనస్సు వెన్న. ఏదో మాలాంటి వాళ్ళు కొందఱు ధనార్జణకై పొరుగూళ్ళు పోయారు. కాని మీరు మాత్రం నిశ్చలంగా పేరాశ లేకుండా, వచ్చిన స్వల్ప ధనంతోనే కాలం గడిపే నిరాడంబరులు" అంటూ గుక్క త్రిప్పకుండా తవ్వలో గవ్వల్లా గలగల పొగడ్తలతో భట్రాజును మించిపోయాడా పట్టణ వాస్తవ్యుడు.

అంతనా మల్లయ్య ఉబ్బి తబ్బిబ్బై తననింతవరకు ఇటులనడమే యెరుగడు. ఈ యువకుడెవరో మంచివానివలె నున్నాడనియెంచి నావగట్ట సిద్ధమయ్యాడు. నావను శరవేగంతో ఆవలినొడ్డు చేర్చి వేశాడత్యుత్సాహంతో. ఆ విధంగా నావ దాటే దాకా కిక్కురుమనకుండా వింటూన్న ప్రయాణికులలో నొక ముదుసలి, "బాబూ! ఇంతకూ నీవెవరు? ఇంతకు ముందెన్నడూ చూచినట్లు లేదే? నీవీ ఊరికి పాత కాపువా? ఆ మల్లయ్యగారు మీకు దగ్గర బంధువా ఏమిటి?" అన్నాడు.

"ఓ! అదా! వాడా! బోడి మల్లయ్య - కూడు లేనప్పుడల్లా మా యింట కూడు కుడుస్తూండేవాడు ఈ ఊరు రాక పూర్వం. కాస్తంత అంబలి పోస్తే పొట్ట పోసుకొనే వాడి అంతరమేమి? నా అంతరమేమి? ఏదో వాణ్ణి ఆట పట్టించాలని అట్లా అన్నాను అంతే! అంత మాత్రాన మీరు ఏదో వాణ్ణి పొగిడాననుకున్నారా ఏమి? కొంప మునిచి. వాడు బట్టతల వాడవ్వడం వలన వాణ్ణి ఒరే! బోడి మల్లయ్యా! అంటుండేవారము" అంటూ నదురు బెదురు లేకుండా అన్నాడా పట్నపు బాటసారి.

అంతనా ముదుసలి అందలి సత్యాన్ని చక్కగా నాకళించు కొన్న వాడై "ఔనౌను పైకమీయకుండా ఏఱు దాటావు ఇక వాడు బోడి మల్లయ్యే కదా! మరి! ఈ లోకంలో అవసరార్ధం ఇంద్రుడు, చంద్రుడు అని, పబ్బం గడిచక ఆ! సంతలో చింతకాయ అనడం బ్రతుకు తెఱవు. అని ముద్దు ముద్దుగా ముదుసలి ఎత్తి పొడిచిన మాటలు ఆ నోటా ఆనోటా పడి సామెతగా రూపొందినది. *